సాక్షి
జోగులాంబ గద్వాల
బుధవారం । 18 । డిసెంబర్ । 2024



ఉద్యాన పంటలకు..
ఉద్యాన పంటలకు కేంద్రం ప్రోత్సాహం అందిస్తుందని కలెక్టర్ విజయేందిర అన్నారు.
వివరాలు 8లో ▸



చిగురిస్తున్న ఆశలు
జడ్చర్ల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.6 /9.1

వాతావరణం
చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం, రాత్రివేళ మంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

90 రోజుల కార్యాచరణ పకడ్బందీగా అమలు



అయిజ: ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 90 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలుపర్చాలని డీఐఈఓ హృదయరాజు అధ్యాపకులను ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాలలో 90 రోజుల కార్యాచరణ అమలు తీరును పరిశీలించారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలు, టీచింగ్ డైరీలు, యూనిట్ టెస్టులు, అర్ధ సంవత్సరపు మార్కులను పరిశీలించారు. ఫెయిల్ అయిన విద్యార్థులను మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

రాష్ట్రంలో బలమైన పార్టీగా బీజేపీ



అలంపూర్: రాష్ట్రంలో బలమైన పార్టీగా బీజేపీ బలోపేతం అవుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో బీజేపీ పోలింగ్ బూత్‌ల అధ్యక్షులను ఎంపిక చేసి, నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఏడాది గడిచినా అమలు చేయలేదన్నారు. మోసపూరిత మాటలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్ పార్టీని రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టడం ఖాయమన్నారు. త్వరలోనే జిల్లా, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం అలంపూర్ చౌరస్తాలో బీజేపీ బూత్ కమిటీల అధ్యక్షులు ఎన్నిక నిర్వహించారు. ఉండవెల్లి మండలంలో 22 బూత్ కమిటీల అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర శర్మ, జిల్లా అధికార ప్రతినిధి ఈశ్వర్, నాగేశ్వర్ రెడ్డి, నాగమల్లయ్య, రాము నాయుడు, లక్ష్మణ్ నాయుడు, శరత్, సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ. 6,511

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం 501 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చింది. క్వింటా గరిష్ఠంగా రూ. 6,511, కనిష్ఠంగా రూ. 3,099, సరాసరి రూ. 5,839 ధరలు పలికాయి. 31 క్వింటాళ్ల ఆముదాలు రాగా.. గరిష్ఠంగా రూ. 5,525, కనిష్ఠంగా రూ. 5,369, సరాసరి రూ. 5,479 ధరలు లభించాయి. 1143 క్వింటాళ్ల వరి (సోన) రాగా.. గరిష్ఠంగా రూ. 2,589, కనిష్ఠంగా రూ. 1,822, సరాసరి రూ. 2,519 ధరలు వచ్చాయి. 386 క్వింటాళ్ల కందులు రాగా.. గరిష్ఠంగా రూ. 8,589, కనిష్ఠంగా రూ. 2,100, సరాసరి రూ. 7269 ధరలు పలికాయి.

వణికిస్తోన్న చలి..!


జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు



భీంనగర్ - నదిఅగ్రహారం రహదారిలో చలికి వణుకుతూ పాలు అమ్ముతున్న రైతు

- కనిష్ట ఉష్ణోగ్రత 11.5 డిగ్రీల నమోదు
- తీవ్రమైన చలితో ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, వృద్ధులు
- రాత్రివేళ నిర్మానుష్యంగా చౌరస్తాలు

వారం రోజులుగా నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు..



గద్వాలటౌన్/కేటీదొడ్డి: చలి అంటేనే ఒంట్లో వణుకు పుడుతోంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరినీ గజగజలాడిస్తోంది. శీతాకాలం ఆరంభంలో మొదట చలి తీవ్రత కాస్త తక్కువగా ఉన్నప్పటికీ.. గడిచిన వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఇప్పటి వరకు కనిష్ఠ ఉష్ణోగ్రత 11.5 డిగ్రీల స్థాయికి పడిపోయింది. రానున్న రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రతలు ఘననీయంగా పడిపోయే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. సాయంత్రం 5 నుంచి చలి మొదలై ఉదయం 9 గంటల వరకు వణికిస్తుంది. తీవ్రమైన చలితో పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది స్వెటర్లు, శాలువాలు, దుప్పట్లతో చలి నుంచి రక్షణ పొందడానికి యత్నిస్తున్నారు. గ్రామాల్లో చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఆరోగ్య పరమైన సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలు సోకుతున్నాయి. శ్వాసకోశ సంబంధ వ్యాధులు ఉన్నవారు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. వయోబేధం లేకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

చీకటి పడగానే రోడ్లు నిర్మానుష్యం..



తెల్లవారుజామున 5 గంటలకు నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

వారం రోజుల వ్యవధిలో రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. జిల్లా కేంద్రంతో పాటు అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీలతో పాటు ఆయా మండలాల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో ద్విచక్ర వాహనంపై తిరగలేని పరిస్థితి ఉంది. చీకటి పడగానే రోడ్లు, ప్రధాన చౌరస్తాలు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లు, మార్కెట్లు, బస్టాండ్లు జనం లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో ఉదయం 9 గంటలు దాటినా పట్టణాల్లో జనసంచారం కనిపించడం లేదు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం సమయంలో చలిలోనే పారిశుద్ధ్య పనులు చేస్తున్నాం. వయసు పైబడిన వారు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం తర్వాత ఇళ్ల నుంచి బయటికి రావడం లేదు. చలి మంటలతో ఉపశమనం పొందుతున్నాం.

– నర్సింహులు, పారిశుద్ధ్య కార్మికుడు, కేటీదొడ్డి

వెన్నులో వణుకు పుట్టిస్తుంది..




చలి వెన్నులో వణుకు పుట్టిస్తుంది. రాత్రివేళ పంటకు నీరు పెట్టేందుకు వ్యవసాయ పొలానికి వెళ్లాలంటే జంకుతున్నాం. కూరగాయల అమ్మకందారులు, వ్యవసాయదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాయంత్రం 6 గంటలు అయిందంటే ఇంట్లోనే ఉంటున్నాం.

– గద్వాల తిమ్మప్ప, రైతు, కేటీదొడ్డి

కమ్ముకుంటున్న పొగమంచు..

తెల్లవారుజామున పొగమంచు కురుస్తుంది. ఒక్కోసారి పొగమంచు చాలా దట్టంగా కురుస్తూ రహదారులను కప్పేస్తుంది. దీంతో ముందు వచ్చే వాహనాలు సమీపానికి వచ్చే వరకు కనిపించడం లేదు. మంచు కురిసేటప్పుడు వాహనదారులు తగు జాగ్రతలు తీసుకోవాలి. లైట్లు వేసుకోవడంతో పాటు తక్కువ వేగంతో వాహనం నడపాలి.



జిల్లా కేంద్రంలో కమ్ముకున్న పొగమంచు.



పాత బస్టాండ్ వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు



కేటీ దొడ్డిలో చలిమంట కాచుకుంటున్న మహిళలు

చిన్నారులపై శ్రద్ధ అవసరం..

చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాతావరణ మార్పుల వల్ల చిన్నారులు త్వరగా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల ఉదయం, సాయంత్రం వారిని బయట తిరగనీయొద్దు. గ్రామాల నుంచి పట్టణాల్లోని పాఠశాలలకు ఉదయం సమయాల్లో బస్సు, ఆటోల్లో వెళ్లే విద్యార్థులు విధిగా స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించాలి. పిల్లలకు ఎక్కువగా జలుబు చేస్తే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

■ పొడి చర్మం ఉన్నవారు ఎక్కువగా ఇబ్బందిపడే అవకాశం ఉంది. చర్మం పగుల్లిచ్చి మంట పుడుతుంది. అందువల్ల చర్మం పొడిబారి పోకుండా చూసుకోవాలి. ఇందుకోసం వ్యాస్‌లెన్, పెట్రోలియంజెల్లి, మాయిశ్చరైజర్లు వాడాలి. స్నానానికి కూడా గ్లీజరిన్, మాయిశ్చరైజర్ ఉన్న సబ్బులు వాడటం ఉత్తమం.

కోర్టు భవన నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తాం



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ బీఎం సంతోష్

- ఇంటిగ్రేటెడ్ జిల్లా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ బీఎం సంతోష్

సాక్షి ఎఫెక్ట్..

గద్వాల న్యూటౌన్: ఇంటిగ్రేటెడ్ జిల్లా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి ఎదురవుతున్న అవాంతరాలపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'సందిగ్ధం!' కథనానికి కలెక్టర్ బీఎం సంతోష్ స్పందించారు. ఇంటిగ్రేటెడ్ జిల్లా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి గద్వాల మండలం పూడూరు శివారులోని సర్వే నంబర్ 368లో కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు లొకేషన్ మ్యాప్‌ను చూశారు. అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. కోర్టు నిర్మాణానికి సంబంధించి రెండు వర్గాల న్యాయవాదుల నుంచి సమస్యలపై ఆరా తీశారు. కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి రహదారి కనెక్టివిటిని కూడా పరిశీలించారు. ప్రధాన రహదారి నుంచి కోర్టు భవనానికి కేటాయించిన స్థలం వరకు రహదారిని నిర్మించవచ్చని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం కోర్టు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. వారి వెంట తహసీల్దార్ మల్లిఖార్జున్, ఇరువర్గాల బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రం.. భక్తజనసంద్రం



ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వేదపండితులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం పుష్కరిణీలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు చక్రస్నానంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. అక్కడి నుంచి భాజా భజంత్రీలతో కల్యాణ మండపం వరకు స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ధీరేంద్రాదాసు ఆధ్వర్యంలో బ్రాహ్మణ పండితులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ నందీకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు రమేషాచారి, భీంసేనాచారి, మధుసూదనాచారి, రవిచారి, ప్రసన్నాచారి, శశాంక్, శేషదాసుల వారి వంశస్థులు ప్రకాష్‌రావు, రాఘవేంద్రదాసు, విష్ణుదాసు, అరవిందరావు, నాగ రాజు శర్మ, చంద్రశేఖర్‌రావు, ముకుందరావు, బాబురావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో చక్రస్నానం అనంతరం ఉత్సవ మూర్తులతో వేదపండితులు

సమగ్రశిక్ష ఉద్యోగుల మౌన ప్రదర్శన



దీక్ష శిబిరంలో నిరసన వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు

గద్వాలటౌన్: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు మంగళవారం వివిధ సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దీక్ష శిబిరంలో ఉద్యోగులు మౌన ప్రదన్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా పనిచేస్తూ గురుకులాలతో సమానంగా ఫలితాలు సాధిస్తున్నా.. శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో కుంటుపడిన బోధన

- సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెతో నిలిచిన కార్యకలాపాలు
- ముందుకు సాగని విద్యార్థినుల చదువు
- ఆందోళనలో తల్లిదండ్రులు



ఇటిక్యాల కేజీబీవీని పర్యవేక్షిస్తున్న జీసీడీఓ ఫర్జానాబేగం



కేటీదొడ్డి కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులు

గద్వాలటౌన్: ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో పాటు డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రత్యేకాధికారులు (ఎస్ఓ), క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు (సీఆర్టీలు) సమ్మెకు దిగారు. ఈ నెల 10 నుంచి కేజీబీవీల్లో విధులను బహిష్కరించడంతో విద్యాబోధన నిలిచిపోయింది. దీంతో విద్యార్థినుల చదువు ముందుకు సాగడం లేదు. మరోవైపు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న వీరికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో వారు సమ్మెను తీవ్రరూపం చేశారు. సమస్య త్వరగా పరిష్కారం కాకుంటే.. కేజీబీవీల్లో బోధన అటకెక్కడంతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలు పడిపోయే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లావ్యాప్తంగా 12 కేజీబీవీలు, ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఉంది. అందులో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. సుమారు 3వేల మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 144 మంది సీఆర్టీలు, పీజీసీఆర్టీలు బోధన అందిస్తున్నారు. వీరితో పాటు 126 మంది బోధనేతర సిబ్బంది సైతం విధులు నిర్వహిస్తున్నారు. వీరందరూ కూడా విధులను బహిష్కరించి ఆందోళన బాట పట్టారు.

వంతుల వారీగా పర్యవేక్షణ..

జిల్లాలోని కేజీబీవీల్లో వంతుల వారీగా టీచర్లు పర్యవేక్షిస్తున్నారు. పాఠశాలలో ఒకరు, కళాశాలలో ఒకరు చొప్పున బోధన సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. పూర్తిస్థాయిలో బోధన జరగకపోవడంతో ఎస్ఎస్‌సీ విద్యార్థినులను తరగతి గదుల్లో కూర్చోబెట్టి చదివిస్తున్నారు. విద్యార్థినులు హోంవర్క్ చేసుకోవడం.. చదువుకోవడం.. ఆటలాడుతూ కాలం గడుపుతున్నారు. సమ్మె ప్రభావం విద్యార్థినులపై పడకుండా విద్యాశాఖ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. సమీప ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి బోధించాలని సూచిస్తున్నా.. ఆచరణ కష్టసాధ్యంగా మారింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో అరకొరగా ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేస్తే.. అక్కడి విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. నిత్యం మండలస్థాయి అధికారులు కేజీబీవీలను పర్యవేక్షిస్తున్నారే తప్ప పాఠాలు చెప్పడం లేదు.

ఫలితాలపై ప్రభావం..

పాఠశాల స్థాయిలో సిలబస్ ఇంకా పూర్తి కాలేదు. కళాశాల స్థాయిలో ఫిబ్రవరిలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు, మార్చిలో వార్షిక పరీక్షలు ఉన్నాయి. డిసెంబర్‌లోగా సిలబస్ పూర్తయితే పునశ్చరణ తరగతులకు అవకాశం ఉంటుంది. పాఠాలు చెప్పకపోవడంతో విద్యార్థినులపై ఒత్తిడి పెరుగుతోంది. కీలకమైన ఈ సమయంలో చేపట్టిన సమ్మెతో ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

స్తంభించిన కార్యకలాపాలు..

విద్యాశాఖలో అనుబంధంగా పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె ప్రభావం విద్యావ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోంది. ఏపీఓ, సిస్టమ్ ఆనాలిస్టు, డీఎల్ఎంటీ, డీటీపీ, ఎంఐఎస్, సీసీఓ, ఐఈఆర్‌పీ, మెసెంజర్స్, పాఠశాల స్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీలు, కాంప్లెక్స్ స్థాయిలో సీఆర్‌పీలు ఇలా 141 మంది జిల్లాలో పనిచేస్తున్నారు. వీరందరూ కూడా సమ్మెలో ఉండటంతో రాష్ట్రస్థాయి వరకు ఉత్తర, ప్రత్యుత్తరాలు స్తంభించిపోయాయి. యూడైస్‌లు, మధ్యాహ్న భోజన పథకం బిల్లులు నిలిచిపోయాయి. బియ్యం పంపిణీ, బడిబయట ఉన్న చిన్నారుల గుర్తింపు, రాగి జావా అందించడం తదితర అన్నిరకాల పనులతో ఆగిపోయాయి. ముఖ్యంగా భవిత కేంద్రాల్లో సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రత్యేక అవసరాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డిమాండ్లు ఇవే...

■ 20 ఏళ్లుగా తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు కనీస వేతన చట్టం అమలుచేయాలి.
■ రూ.10 లక్షల జీవిత బీమా, రూ. 5లక్షల ఆరోగ్య బీమా వర్తింపజేయాలి.
■ పీఈటీలకు, ఇతర బోధనేతర సిబ్బందికి సాధారణ ఉద్యోగుల మాదిరిగా ఏడాదికి 12 నెలల వేతనం ఇవ్వాలి.
■ పదవీ విరమణ సమయంలో రూ. 20 లక్షలు ఇవ్వాలి.

సమ్మెతో నష్టపోతున్నాం..



టీచర్లు సమ్మెలో ఉండటంతో రోజుకొకరి చొప్పున పాఠాలు చెబుతున్నారు. సమ్మె ప్రభావంతో నష్టపోతున్నాం. ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి టీచర్ల సమస్యలను పరిష్కరించి మాకు న్యాయం చేయాలి.

– కావ్య, పదో తరగతి, ఇటిక్యాల

క్రమబద్ధీకరించే వరకు పోరాటం..



క్రమబద్ధీకరణ కోసం గతేడాది నిరాహార దీక్షలు చేపట్టగా.. రేవంత్‌రెడ్డి న్యాయం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయింది. పలుమార్లు రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేసినా స్పందన లేకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగాం. క్రమబద్ధీకరించే వరకు పోరాటం కొనసాగిస్తాం.

– గోపాల్, సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం కార్యదర్శి

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం..



సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. నిత్యం ఎంఈఓలు, మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థుల బోధనకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. పిల్లల ఆహారం, ఆరోగ్యం విషయంలో తగు చర్యలు చేపట్టాం.

– అబ్దుల్ ఘని, డీఈఓ

క్లుప్తంగా

బొలెరోను ఢీకొట్టిన పత్తి ట్రాక్టర్

- యువకుడి దుర్మరణం

అచ్చంపేట రూరల్: పత్తిలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మంగళవారం రాత్రి అచ్చంపేట పట్టణంలో వై రోడ్డు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బల్మూర్ మండలం బాణాలకు చెందిన నగేష్(26) తన కుటుంబ సభ్యులతో కలిసి తన స్వంత వాహనం బొలెరోలో అమ్రాబాద్ మండలం బీకే తిర్మలాపూర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అచ్చంపేటకు రాగానే పత్తిలోడు ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. వాహనం నడుపుతున్న నగేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య గీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి

ఊర్కొండ: బైక్ అదుపుతప్పి కిందపడ్డ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలో మంగళవారం రాత్రి ఈఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కాల్యాతండాకు చెందిన పీరియానాయక్(30) మండల కేంద్రంలోని తండాకి వెళ్తున్నాడు. ఈక్రమంలో రైస్ మిల్లు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడటంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న తండా యువకులు 108కి సమాచారం ఇచ్చారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని..

హన్వాడ: పొలం వద్ద ఓ వృద్ధుడు చలి మంటలు వేసుకోగా ప్రమాదవశాత్తు ఒంటికి నిప్పంటుకొని చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ కథనం మేరకు.. మండలంలోని గొండ్యాలకు చెందిన భూనేటి ఆశన్న (80) సోమవారం ఉదయం చలి తీవ్రత తట్టుకోలేక మంట వేసుకున్నాడు. క్రమంగా నిద్రలోకి జారుకోగా ప్రమాదవశాత్తు ఒంటికి నిప్పంటుకుంది. వెంటనే కుటుంబీకులు ఆయనను ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తమ్ముడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ..

నవాబుపేట: జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న మహిళ చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ విక్రమ్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎరుకలి అనుసూయ(50) కుమారుడు సాయికుమార్(17) గతేడాది నూతన సంవత్సరం రోజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆమె ఇంటికే పరిమితమై అదే బాధలో ఉంటేంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 14 పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. దీన్ని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం ఆమె మృతి చెందింది.

రైతు బలవన్మరణం

కృష్ణా: మండలంలోని చేగుంటకు చెందిన రైతు బస్వరాజ్ (49) మంగళవారం ఉదయం తన పొలంలో వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నవీద్ తెలిపారు. కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడని.. ఆరోగ్యం బాగోలేక సోమవారం రాత్రి ఇంట్లో చెప్పకుండా వెళ్లి ఉరేసుకున్నట్లు వివరించారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర సమీపంలో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో బైక్ ఢీకొట్టడంతో పాదచారికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కల్వకుర్తి పట్టణం సుభాష్‌నగర్ కాలనీకి చెందిన నవీన్ వంగూర్ నుంచి కల్వకుర్తి వైపు వస్తుండగా తాండ్ర సమీపంలో రోడ్డు దాటుతున్న బాటసారిని బైక్ ఢీకొట్టడంతో గాయపడ్డాడు. బాటసారితో పాటు నవీన్‌కు సైతం గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎస్ రెడ్డి అంబులెన్స్‌కు సమాచారం అందించి, గాయపడిన వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స అందించగా, నవీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించారు.

నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఐటీఐ పాసైన వారికి పాలిటెక్నిక్ డిప్లమాలో రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శాంతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా మెట్టుగడ్డ వద్ద ఉన్న ఐటీఐ కళాశాలలో పేరును రిజిస్ట్రార్ చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 9908228048 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఎట్టకేలకు కందులు కాంటా

24 గంటల తర్వాత శాంతించిన రైతులు

- వ్యాపారులు, రైతులతో పలు దఫాలుగా అధికారుల చర్చలు
- క్వింటాకు రూ. 250 అదనంగా చెల్లించేందుకు ఒప్పుకొన్న వ్యాపారులు


కందులను కాంటా చేయిస్తున్న ఆర్‌డీడీఎం ప్రసాద్‌రావు

నారాయణపేట: ఆరుగాలం కష్టించి పండించిన కందులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదంటూ రైతులు సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి చేపట్టిన ఆందోళన.. మంగళవారం సాయంత్రం 4 గంటలదాక కొనసాగింది. మార్కెటింగ్ ఉన్నతాధికారుల జోక్యంతో రైతులు శాంతించారు. 24 గంటల తర్వాత కందులను కాంటా కావడంతో ఇటు అధికారులు, అటు పాలకులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం కందులపై వేసిన ధరలు తమకు గిట్టుబాటు కాలేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. రైతు సంఘాల ఆధ్వర్యంలో మార్కెట్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. అయితే మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి ఓ మారు వ్యాపారులతో చర్చించడంతో రూ. వంద పెంచేందుకు ఒప్పుకొన్నారు. ఆ ధరకు తాము ఇవ్వమంటూ రైతులు సోమవారం రాత్రి 10 గంటలకు వెళ్లిపోయారు. తిరిగి మంగళవారం ఉదయం 10 గంటలకు మార్కెట్‌కు చేరుకున్న రైతులు.. తెల్లకందులకు రూ. 11 వేలు, ఎర్ర కందులకు రూ. 10,500 ఇవ్వాల్సిందేనంటూ పట్టుబట్టారు. ఇవ్వలేమని వ్యాపారులు చెప్పడంతో స్థానిక మార్కెట్ యార్డు ఎదుట కొందరు, అంబేడ్కర్ చౌరస్తాలో మరికొందరు రైతులు రాస్తారోకోకు దిగారు. దీంతో అటు, ఇటు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న సీఐ శివ శంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మార్కెట్ యార్డుకు చేరుకొని రైతులను శాంతింపజేశారు.

నాణ్యత, డిమాండ్ మేరకు..

మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చే సరుకులకు నాణ్యత, సరఫరా, జాతీయ వ్యవసాయ మార్కెట్‌లో డిమాండ్ మేరకు వ్యాపారులు ధరలను కోడ్ చేస్తారని ఆర్‌డీడీఎం ప్రసాద్‌రావు రైతులకు చెప్పుకొచ్చారు. అందుకు రైతులు ససేమిరా అంటూ శనివారం నుంచి సోమవారం వరకు రూ. 2వేలు ఎలా తగ్గుతాయంటూ నిలదీశారు. ఇప్పటికే వ్యాపారులతో చర్చించడం జరిగిందని.. సోమవారం వేసిన ధరల కోడ్‌కు అదనంగా రూ. 200 ఇచ్చేందుకు ఒప్పించామంటూ ఆర్‌డీడీఎం రైతులను సముదాయించారు. అయితే తమకు రూ. 500 పెంచాల్సిందేనంటూ రైతులు మళ్లీ రోడ్డెక్కారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, డీఎంఓ బాలమణి, మార్కెట్ కార్యదర్శి భారతి, ఆర్డీఓ రాంచందర్ నాయక్‌లు మరోసారి వ్యాపారులతో చర్చించారు. చివరకు రూ. 225 పెంచేందుకు ఒప్పుకున్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో షాపు నంబర్ 41లో ఆర్‌డీడీఎం దగ్గరుండి కందులను కాంటా చేయించారు.

మార్కెట్ పరిస్థితిపై ఆరా తీసిన జేడీఎం

వ్యవసాయ మార్కెట్ యార్డులో కంది రైతుల ఆందోళనపై రాష్ట్ర వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం ఆరా తీశారు. ఆర్‌డీడీఎం ప్రసాద్‌రావుకు ఫోన్ చేసి కందుల ధరలు, వాస్తవ పరిస్థితి, రైతుల ఆందోళన తదితర వివరాలను తెలుసుకున్నారు. సోమవారం ధరలు తక్కువగా ఉన్నాయంటూ రైతు ఆందోళనకు దిగారని.. వ్యాపారులతో చర్చించి సమస్యను పరిష్కరించినట్లు వివరించారు.


వ్యాపారులతో చర్చిస్తున్న అధికారులు

ఇదిగో ఇతర మార్కెట్ల ధరలు..


ఇతర మార్కెట్‌లో వచ్చిన ధరలను చూపిస్తున్న ఆర్డీఓ రాంచందర్ నాయక్

రాష్ట్రంలోని వివిధ మార్కెట్ యార్డుల్లో కందుల ధరల కంటే నారాయణపేటలోనే ఎక్కువగా ఉన్నయంటూ ఆర్డీఓ రాంచందర్ నాయక్ రైతులకు చెప్పుకొచ్చారు. 16న ఎర్ర కందులకు షాద్‌నగర్‌లో క్వింటాకు రూ. 7,759, తాండూర్‌లో రూ. 9,249, జహీరాబాద్‌లో రూ. 9,755, బాదేపల్లిలో రూ. 8,066, కర్ణాటకలోని యాద్గీర్‌లో రూ. 10,112, తెల్లకందులకు రూ. 11,030 ధరలు పలికాయని తెలిపారు. అదే నారాయణపేటలో తెల్లకందులు రూ. 10,901, ఎర్ర కందులు రూ. 10,756 పలికాయని వివరించారు. 17న తాండూర్‌లో రూ. 9,359, జహీరాబాద్‌లో రూ. 9,351, బాదేపల్లిలో రూ. 7,940 ధర పలికిందని చెప్పారు. దీంతో రైతులు ఆగ్రహిస్తూ.. ఆ ధరలు మాకు చెప్పకండి, శనివారం వచ్చిన ధరలు ఎందుకు రాలేదంటూ ప్రశ్నించారు. సోమవారం వేసిన ధరలకు రూ.500 పెంచి ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు.

రూ. 200 ఇవ్వనింకే బిచ్చగాళ్లమా?



ఈ ఫొటోలో కనిపిస్తున్నది మద్దూర్ మండలం మన్ననూర్‌కు చెందిన మహిళా రైతు ఎల్లమ్మ. తాను ఐదు బస్తాల ఎర్ర కందులు తెస్తే.. క్వింటాకు రూ. 8,780 ధర వేశారు. శనివారం రూ. 10 వేలు పలికిన ధర.. ఇప్పుడు రూ. 9వేలలోపు ఎలా తగ్గుతుందంటూ అధికారులను నిలదీశారు. కందుల ధరలపై రూ. 2వేలు ఎందుకు తగ్గించారని ప్రశ్నిస్తుంటే.. రూ. 200 పెంచుతామని అంటున్నారని.. మేమేమి బిచ్చగాళ్లమా అని ప్రశ్నించారు.

రూ.4 కమీషన్ తీసుకుంటారా?



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామానికి చెందిన హన్మంతు. 7 బస్తాల తెల్ల కందులను మార్కెట్‌కు తీసుకువస్తే రూ. 9,680 ధర వేశారు. రూ. 200 పెంచితే రూ.9,880 అవుతుంది. శనివారం రూ. 11 వేలు ఉన్న ధర సోమవారం రూ. 10వేలకు పడిపోయిందని.. కమీషన్ రూ. వందకు రూ.4 తీసుకునేందుకు వస్తుంది కాని రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వరంటూ అధికారులను నిలదీశారు. ఇందుకు అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు.

పేటలోనే అధిక ధరలు..

ఇతర మార్కెట్ల కంటే నారాయణపేట మార్కెట్‌లోనే కందులకు అధిక ధరలు ఉన్నాయి. ఇందులో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు ఎవరూ కుమ్మక్కు కాలేదు. ఈనామ్‌లో సరుకుకు టెండర్లు వేస్తాం. మిల్లర్లు వారికి కావాల్సిన రేట్లకు ధరలు కోడ్ చేస్తారు. రోజురోజు ధరల్లో మార్పు ఉంటుంది. రైతులు అర్థం చేసుకోవాలి.

– పవన్‌కుమార్ లాహోటి, గంజ్ అసోసియేషన్ అధ్యక్షుడు

బైక్‌పై నిదానంగా వెళ్లమన్నందుకు జరిమానా

నాగర్‌కర్నూల్ క్రైం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించకున్నా అకారణంగా ట్రాఫిక్ ఎస్‌ఐ చలాన్ వేసిన సంఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకోగా, మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన మహ్మద్ మోయినొద్దీన్ ఇంటి సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఆ దారిలో సివిల్ డ్రెస్‌లో ఉన్న ట్రాఫిక్ ఎస్‌ఐ కల్యాణ్ వేగంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. దీంతో మహ్మద్ మోయినొద్దీన్ ట్రాఫిక్ ఎస్‌ఐని వేగంగా ఎందుకు వెళ్తున్నారని, నిదానంగా వెళ్లమని, ఇదివరకే ఇదేకాలనీలో రోడ్డు ప్రమాదాలు జరగాయని చెప్పాడు. దీంతో ఆగ్రహంతో ట్రాఫిక్ ఎస్‌ఐ మోయినొద్దీన్‌కు రూ.2వేలు జరిమానా విధించాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ ద్విచక్రవాహనదారుడి పట్ల దురుసుగా మాట్లాడారని, అనవసరంగా ట్రాఫిక్ చలాన్ వేశారని, ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. సంఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఎస్‌ఐని వివరణ కోరగా మహ్మద్ మోయినొద్దీన్ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనం నడపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడారని, తనపట్ల దురుసుగా మాట్లాడటంతో జరిమానా విధించినట్లు తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం

తెలకపల్లి: తల్లీకూతురు అదృశ్యం కావడంతో కేసు నమోదైన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన జంగం శ్రీనుకు అదే గ్రామానికి చెందిన జంగం మంజులతో 10 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి బిందుశ్రీ(6) ఉంది. భార్యాభర్తలు సోమవారం కూలీ పనికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికొచ్చి తిని పడుకున్నారు. ఉదయం లేచి చూసే సరికి మంజుల, బిందుశ్రీ కనిపించ లేదు. ఎక్కడ వెతికినా వారి ఆచూకీ కనిపించకపోవడంతో భర్త మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతిభ చాటి పతకాలు సాధించాలి


ఎంపికలను ప్రారంభిస్తున్న జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రాస్‌కంట్రీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం జిల్లా స్థాయి క్రాస్‌కంటీ పరుగు ఎంపికలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ జిల్లాస్థాయి ఎంపికల్లో జిల్లావ్యాప్తంగా దాదాపు 80మంది బాల, బాలికలు హాజరైనట్లు తెలిపారు. అండర్–16 ఏళ్లలోపు బాల, బాలికలకు 2కేఎం, 18 ఏళ్లలోపు బాలికలకు 4కేఎం, బాలురకు 6కేఎం, 20 ఏళ్లలోపు బాలికలకు 6కేఎం, బాలురకు 8కేఎం, మహిళలు, పురుషులకు 10కేఎం పరుగు పోటీల్లో ఎంపికలు నిర్వహించామన్నారు. కల్వకుర్తిలో ఈనెల 22వ తేదీన 10వ రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి భానుకిరణ్, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అథ్లెటిక్స్ సంఘం సభ్యులు సి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

శిశు గృహాల్లో వసతులు పరిశీలించిన న్యాయమూర్తి

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిశుగృహ, బాలసదన్, స్టేట్‌హోమ్‌లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర మంగళవారం సందర్శించారు. ఆయా హోమ్‌లలో ఉన్న నీరు, వసతి సౌకర్యాలను, అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. బాలలను పలకరించి వారి యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు సరైన ఆహారం, సరైన వైద్యం అందుతుందా లేదా అని శిశుగృహ, బాలసదన్‌లో అందుబాటులో ఉన్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేట్ హోమ్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాలకార్మికులు, బాల్యవివాహాలు, లీగల్ సర్వీసెస్ యాక్టుల గురించి వివరించారు.


శిశుగృహలో ఉన్న శిశువులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

వీధికుక్క దాడి.. బాలికకు గాయాలు

మక్తల్: పట్టణంలోని రాఘవేంద్రకాలనీలో మంగళవారం మధ్యాహ్నం ఆరేళ్ల బాలిక ఆరాధ్యపై వీధి కుక్క దాడి చేసింది. స్థానికుల కథనం మేరకు.. గద్వాలకు చెందిన సారిక శేఖర్‌గౌడ్ దంపతులు తన కుమార్తె ఆరాధ్యతో కలిసి రాఘవేంద్ర కాలనీలో ఉండే ఆనంద్‌గౌడ్ ఇంటికి వచ్చారు. తల్లిదండ్రులు ఇంట్లో ఉండగా బాలిక బయటకు రాగా కుక్క దాడి చేసింది. ఎడమకాలుకు గాయం కావడంతో కాలనీవాసులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.


మక్తల్ ఆస్పత్రిలో చిన్నారి ఆరాధ్య

కుక్కల దాడిలో 18 మేక పిల్లల మృత్యువాత

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిర్మలాపూర్ పద్మకు చెందిన 18 మేక పిల్లలను మంగళవారం సాయంత్రం వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి. వాటి విలువ రూ.2 లక్షల ఉంటుందని బాధితురాలు తెలిపారు. దాడిలో మృతి చెందిన మేక పిల్లలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని మాజీ సర్పంచ్ సత్యం, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు కోరారు.


దేవల్‌తిర్మలాపూర్‌లో కుక్కల దాడిలో మృతి చెందిన మేక పిల్లలు

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు ఉమ్మడి జిల్లా ఎంపిక

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి
- రాష్ట్రంలో 12.42లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు : వీసీ రాజిరెడ్డి


జ్యోతి ప్రజ్వల చేస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యాన పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం ఉద్యానశాఖ సంయుక్త సంచాలకులు బాబు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మామిడి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(సీడీపీ) కింద మామిడి తోటల నమోదు, సేంద్రీయ ధృవీకరణ, ఎగుమతి–దేశీయ మార్కెట్‌పై ఉమ్మడి జిల్లాలోని ఆదర్శరైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ విజయేందిర జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత దేశం ప్రపంచ మార్కెట్లో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు కేంద్రం సీడీపీని అమలు చేస్తోందన్నారు. ఈపథకం కింద దేశంలో 11రాష్ట్రాల్లో 12 క్లస్టర్లలో ప్రయోగాత్మకంగా అమలుచేయడం ప్రారంభించిందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను మామిడి పంటకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సుమారుగా 17,000మందికి పైగా రైతులు, 52,912 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారుగా రూ.165కోట్ల బడ్జెట్‌తో ప్రసాద్ సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్‌ను అమలు ఏజెన్సీగా జాతీయ ఉద్యాన బోర్డు(ఎన్‌హెచ్‌బీ) ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. మామిడి రైతులు కొత్త టెక్నాలజీ, సాంకేతిక పద్ధతులపై అవగాహనతో మంచి దిగుబడులు పొందాలన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 12.42 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండుస్తున్నట్లు, ఉద్యాన పంటలు 39 శాతం ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన సాగులో ఉమ్మడి జిల్లాను నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దాలని అన్నారు. మామిడి క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం కింద ఎరువులు, పురుగు మందులు తగ్గించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. మామిడి తోటలను 2 ,3 సంవత్సరాల్లో సేంద్రీయ సాగు లో మార్చే అవకాశం ఉందని అన్నారు. బార్ కోడింగ్‌తో నిజమైన రైతులకు మంచి అవకాశం అన్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా ఏర్పాటైన అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రాడక్ట్స్ ఎక్స్‌పర్ట్ డెవలప్మెంట్ అథారిటీ (అపెడా) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పి.నాయుడు మాట్లాడుతూ పొలాల, తోటల రిజిస్ట్రేషన్, ఏపీ పోర్టల్ లో మామిడి ఎగుమతులకు ఉన్న అవకాశాలు గురించి వివరించారు. అపెడా, ఎన్‌హెచ్‌బీ, ప్లాంట్ క్వారంటైన్ స్టేషన్ నుంచి వచ్చిన అధికారులు, రాష్ట్ర విత్తన సేంద్రీయ సాగు అథారిటీ సలహాదారు, సీనియర్ శాస్త్రవేత్త హెడ్, తదితరులు రైతులకు అవగాహన కల్పించి సందేహాలు నివృత్తి చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఉద్యానశాఖ సయుక్త సంచాలకులు వి.బాబు, జిల్లా ఉద్యాన శాఖాధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.


హాజరైన అధికారులు, రైతులు

క్లుప్తంగా...

నేడు అసెంబ్లీ ముందుకు ఆర్‌ఓఆర్- 2024 బిల్లు

ప్రవేశపెట్టనున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో కీలక పరిణామం చోటు చేసుకోనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలులోకి తెచ్చిన భూచట్టం స్థానంలో కొత్త చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తేనుంది. ఈ మేరకు రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌ఓఆర్)-2024 బిల్లును బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకుంటాయి. సాదా బైనామాల పరిష్కారం, మ్యుటేషన్ తదితర కీలక అంశాలపై ఈ చట్టంతో స్పష్టత వస్తుంది. వాస్తవానికి, ఈ చట్టాన్ని తదుపరి సమావేశాల్లో ఆమోదించాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉన్నా, రైతుల ప్రయోజనార్థం ఈ సమావేశాల్లోనే చట్టాన్ని అమలులోకి తేవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బిల్లును ప్రవేశపెట్టనున్నారు.

కేటీఆర్, హరీశ్‌ల దొరతనం మరోసారి బయటపడింది..

వారెందుకు బేడీలు వేసుకోలేదు: మంత్రి సీతక్క ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: కేటీఆర్, హరీశ్‌ల దొరతనం మరోసారి బయటపడిందని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బేడీలు వేశారు తప్ప కేటీఆర్, హరీశ్‌లు వేసుకోలేదన్నారు. నిరసనల్లో కూడా బీఆర్ఎస్ నేతల్లో సమానత్వం లేదన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు పదిసార్లకు పైగా బేడీలు వేశారని, అప్పుడు అందుకు కారణమైన అధికారులపై చర్యలు కూడా తీసుకోలేదన్నారు. రైతులకు బేడీలు వేసిన అంశాన్ని సీఎం రేవంత్ తీవ్రంగా పరిగణించి వెంటనే చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. సభ్యుల ప్రవర్తన విషయంలో బీఆర్ఎస్ హయాంలో పెట్టిన నిబంధనలపై వాళ్లే అభ్యంతరం చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. 'గతంలో వెల్‌లోకి వస్తే సభ నుంచి సస్పెండ్ చేసేవారు. ఇప్పుడు వాళ్లు పెట్టిన నిబంధనలను వారే కాలరాస్తున్నారు' అని సీతక్క చెప్పారు.

అప్పుల లెక్కలు.. అన్నీ అబద్ధాలే



శాసనసభలో హరీశ్ వర్సెస్ భట్టి

- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ పరస్పర విమర్శలు
- వాస్తవాలు నిరూపించేందుకు సిద్ధమంటూ సవాళ్లు
- ఎఫ్ఆర్‌బీఎం కింద రూ.51,277 కోట్లు మాత్రమే అప్పు చేశామన్న భట్టి
- గ్యారంటీల కింద రూ.61,991 కోట్లు, గ్యారంటీ లేని రుణాలు రూ.10,999 కోట్లు సమీకరించినట్లు వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే రూ.1,27,208 కోట్లు అప్పు చేసిందన్న హరీశ్
- తాము పదేళ్లలో కేవలం రూ.4,17,496 కోట్లు మాత్రమే అప్పు చేసినట్లు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో చేసిన అప్పులు.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసిన అప్పులు.. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయాన్ని వేడెక్కించాయి. ఆరోపణలు.. ప్రత్యారోపణలు, సవాళ్లు.. ప్రతి సవాళ్లతో సభ అట్టుడికింది. ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క...గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్‌రావుల మధ్య వాడివేడి వాదనలు కొనసాగాయి. అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పరస్పరం విమర్శించుకుంటూ వారివారి లెక్కలను సభ ముందుంచారు.

ప్రివిలేజ్ మోషన్‌పై మాట మార్చారు: భట్టి


'రాజకీయాలు చేయటమే లక్ష్యంగా వ్యవహరించే హరీశ్‌రావు సభలో అన్నీ అబద్ధాలే చెబుతారు. ఏడాదిలో మేం చేసిన అప్పులపై ఆయన చెప్పే లెక్కలు సరికాదు. పదేళ్ల వారి హయాంలో చేసిన అప్పుల లెక్కల్లోనూ ఆయనది ప్రజలను తప్పు దారి పట్టించే పద్ధతే. అందుకే మేం అధికారంలోకి రాగానే శ్వేత పత్రం రూపంలో వాస్తవాలను ప్రజల ముందుంచాం. మళ్లీ చర్చ పెడితే నిరూపించేందుకు సిద్ధం. బీఆర్ఎస్ నేతలు 10 సంవత్సరాల పాలనలో తప్పులు చేసినందుకు గత డిసెంబర్‌లో జనం శిక్షించారు. ఆరు నెలల్లో పార్లమెంటు ఎన్నికలప్పుడు డిపాజిట్ దక్కకుండా వారికి మతిపోయేలా చేశారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఆ పార్టీది భూస్వామ్య మనస్తత్వం. భూమిలేని నిరుపేదలకు ఆర్థిక సాయం చేయరా? అని ఖమ్మంలో ఓ విలేకరి అడిగినప్పుడు, వారికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పా. దాని ఆధారంగా ప్రివిలేజ్ మోషన్ ఇచ్చి, ఇప్పుడు అప్పుల మీద అవాస్తవాలు మాట్లాడితే ఇచ్చామంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో వారికి అనుకూలంగా సభ నియమాలు రూపొందించుకున్నారు. వారి నిబంధనల్లోనే సభలోకి ప్లకార్డులు తీసుకురావద్దని ఉంది.. కానీ నిన్న తీసుకొచ్చారు. వీరా నామీద ప్రివిలేజ్ మోషన్ ఇచ్చేది? వారి హయాంలో స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నప్పుడు బీఏసీలో పాటించిన పద్ధతినే మేం ఇప్పుడు అనుసరిస్తున్నాం. ఇప్పుడు ప్రసాద్ స్పీకర్‌గా ఉన్నారు. వ్యక్తి మారారు తప్ప స్పీకర్ స్థానం అదే. ఆ స్థానాన్ని గౌరవించాలి కదా.. నిన్న బీఏసీలో కాగితాలు విసిరి బయటకొచ్చి ఏవేవో మాట్లాడుతున్నారు.

ఆ ప్రచారంలో వాస్తవం లేదు

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్లు అప్పు చేసిందని విపక్షాలు చేసే ప్రచారంలో వాస్తవం లేదు. ఎఫ్ఆర్‌బీఎం కింద మేము రూ.51, 277 కోట్లు మాత్రమే అప్పు చేశాం. గ్యారంటీల కింద రూ. 61,991 కోట్లు, గ్యారంటీ లేని రుణాలు రూ.10,999 కోట్లు సమీకరించాం. మీ హయాంలో చేసిన అప్పుపై వడ్డీ రూపేణ రూ.66 వేల కోట్లు చెల్లించాం. మీరు పెట్టిపోయిన పెండింగు బిల్లులు రూ.40 వేల కోట్లలో ఇప్పటికి రూ.14 వేల కోట్లు చెల్లించాం. ప్రజల ఆస్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన ఔటర్ రింగురోడ్డును ఆ ప్రభుత్వం 30 ఏళ్ల లీజు పేరుతో అమ్ముకుంది. అదే పద్ధతిలో మేం వచ్చే 30 ఏళ్ల కాలానికి జీఎస్టీ లాంటి ఆదాయ వ్యవహారాలను ఏ అదానికో, అంబానికో లీజుకిస్తే రాష్ట్ర పరిస్థితి ఏం కావాలి?..' అని భట్టి నిలదీశారు.

పరిమితంగానే మా అప్పులు: హరీశ్‌రావు

'మా ప్రభుత్వం పరిమితంగా చేసిన అప్పును తప్పుడు లెక్కలతో పెంచి భూతద్దంలో చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అబద్ధపు అప్పుల బూచి చూపి ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ ఆటలు సాగనివ్వం. మేం చెప్పే లెక్కలే సరైనవని నిరూపించేందుకు సిద్ధం. సభలో ప్రత్యేక చర్చ పెట్టండి, ఆడిటర్లను, ఆర్థిక నిపుణులను పిలిపించుకోండి.. నేను చెప్పేవే సరైన లెక్కలని నిరూపిస్తాను. ఇది నా ఛాలెంజ్. ఆర్బీఐ నేటి లెక్కల ప్రకారం గత ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పులు రూ.1,27,208 కోట్లు. ఐదేళ్లలో చేయబోయే అప్పు దాదాపు రూ.6,36,400 కోట్లు. కానీ మా ప్రభుత్వం పదేళ్ల కాలంలో తెచ్చిన అప్పులు కేవలం రూ.4,17,496 కోట్లు మాత్రమే. 'ఆర్బీఐ తాజాగా విడుదల చేసిన గణాంకాలను ఆయన ఉటంకించారు) కరోనా కారణంగా కేంద్రం అదనంగా 1.75 శాతం అప్పు తీసుకోవాలని సూచించడంతో తీసుకున్నాం. లేకపోతే అంతకూడా అప్పు అయ్యేది కాదు. దీనిపై నేను సవాల్ విసురుతున్నా.. చర్చకు సిద్ధం. మేం రూ.6,71,757 కోట్లు అప్పు తీసుకున్నామని ఒకసారి, రూ.7 లక్షల కోట్లు అని మరోసారి, సభలో రూ.7,11,911 కోట్ల అప్పులంటూ నోటికొచ్చినట్లు అబద్ధాలు చెబుతున్నారు. ప్రత్యేక చర్చ పెడితే వాస్తవాలు నిరూపిస్తా. ఏడాది పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై తప్పుడు లెక్కలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీఏసీతో సంబంధం లేకుండా సభలో బిల్లులు ప్రవేశపెట్టడం వింతగా ఉంది. గత సభలో అప్పుల గురించి తప్పుడు లెక్కలు చూపినందుకే భట్టి విక్రమార్కపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చాం. కానీ మరో అంశంపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చినట్టు అబద్ధాలు చెప్తున్నారు. చర్చ పెడితే వాస్తవాలు నిరూపిస్తాం..' అని హరీశ్‌రావు సవాల్ చేశారు.



పెట్టుబడులపై తప్పుడు ప్రచారం: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ప్రతిపక్షాలు తప్పుదారి పట్టించేలా సమాచారం వ్యాప్తి చేస్తున్నాయి. ప్రముఖ అంతర్జాతీయ కంపెనీ ఫాక్స్‌కాన్ ఇప్పటికే తెలంగాణలో పెట్టుబడులు పెట్టి తన ప్రణాళికలు అమలు చేస్తోంది. ఫాక్స్‌కాన్ పలు రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విస్తరించుకుంటూ, స్థానిక సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని, సమర్థవంతమైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటోంది. తెలంగాణలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు ఫాక్స్‌కాన్ గతంలో చేసిన ప్రకటనలకు కట్టుబడి ఉంది. వచ్చే మూడు రోజుల్లోనే ఫాక్స్‌కాన్ నుంచి భారీ పెట్టుబడుల ప్రకటన వస్తుంది. ప్రగతిని అడ్డగించే తప్పుడు ప్రచారాన్ని ఆపివేసి అన్ని పార్టీలూ అభివృద్ధికి మద్దతు ఇవ్వాలి. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటుకు కృషి చేయాలి' అని అసెంబ్లీ లాబీల్లో ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

కెప్టెన్ లేని బీఆర్ఎస్ నావ తుపానులో చిక్కుకుంది

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: పార్టీకి నాయకుడు లేకపోతే ఎలా ఉంటుందో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సభలో చూస్తే స్పష్టంగా అర్థమవుతోందని మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెప్టెన్ లేని బీఆర్ఎస్ నావ తుపానులో చిక్కుకుందన్నారు. ఆ నావ ఎక్కడకు వెళుతుందో వారికే తెలియడం లేదని చెప్పారు. ప్రజా సమస్యలపై సభలో చర్చ జరగకూడదన్నది బీఆర్ఎస్ టార్గెట్‌గా కనిపిస్తోందని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. భూమిలేని పేదలకు డబ్బులు ఇస్తామంటే బీఆర్ఎస్ వద్దంటోందని, రైతులకు మేలు జరగడం వారికి ఇష్టం లేదని విమర్శించారు. తనపై సభా హక్కుల తీర్మానం ఎందుకు ఇచ్చారో వారికే అర్థం కావడం లేదని భట్టి చెప్పారు.

కనీసం వెయ్యి కోట్లయినా ఇవ్వండి

- జీరో అవర్‌లో అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5,020 కోట్ల మేర పేరుకు పోయాయని, అందులో కనీసం రూ.1,000 కోట్లయినా విడుదల చేయాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని కోరారు. 20 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టంగా మారిందని మంగళవారం జీరో అవర్ సందర్భంగా ఆయన అసెంబ్లీ దృష్టికి తెచ్చారు. విదేశీ విద్యానిధి పథకం కింద విద్యార్థికి రూ.20 లక్షలు మంజూరు చేసేందుకు రూ.5 లక్షలు కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని.. ఏపీ, తెలంగాణలో లక్షలాది మంది విద్యార్థులు ప్రయోజనం పొందారని గుర్తుచేశారు.

ఉస్మానియా తరలింపు ఆపండి: రాజాసింగ్



ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌కు తరలించే ప్రతిపాదనను రద్దు చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు. గోషామహల్‌లో ఆస్పత్రి కడితే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, ఉస్మానియా వెనుకవైపు ఉన్న విశాలమైన స్థలంలో కొత్త నిర్మాణం జరపాలని సూచించారు.

- సింగరేణిలో పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రాజేందర్ మక్కాన్‌సింగ్ కోరారు.
- కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు కోరారు.
- హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. దళితబంధు పథకం కింద 5 వేల కుటుంబాలకు ఇవ్వాల్సిన రెండోవిడత ఆర్థిక సాయాన్ని విడుదల చేయాలని కోరారు.

బీఆర్ఎస్ హయాం, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సవాల్



మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్‌జాదవ్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సవాల్ విసిరారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్‌జాదవ్ విలేకరులతో మాట్లాడారు. లగచర్ల ఘటనపై చర్చకు రెండ్రోజులుగా పట్టుబట్టినా ప్రభుత్వం పారిపోయిందని, సభా నియమాలపై నీతులు చెబుతూ ప్రభుత్వమే ఉల్లంఘించిందని ఆరోపించారు. పాలక పక్షం ప్లకార్డులు లోనికి తెస్తే స్పీకర్ ఎలా అనుమతించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు కన్నీరు పెడుతుంటే సీఎం, మంత్రులు జల్సాలో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని, లగచర్లపై ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అసెంబ్లీని కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ప్రహసనంగా మార్చేసిందని, అన్ని వ్యవస్థలను సీఎం రేవంత్ నిర్వీర్యం చేశారని విరుచుకుపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌లపై కేసులు, అరెస్టులు అంటూ నాలుగు గోడల మధ్య ఉండి రేవంత్ వార్తలు రాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఫార్ములా వన్ మీద దమ్ముంటే చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మోసాలపై చర్చకు సిద్ధమని, దమ్ముంటే శాసనసభను పదిహేను రోజులు నడపాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో పోలీస్ పాలన నడుస్తోందని, అన్నింటికీ ఎదురొడ్డి ప్రజల పక్షాన పోరాడతామని చెప్పారు.

చిగురిస్తున్న ఆశలు

అసెంబ్లీలో రెవెన్యూ డివిజన్‌పై ఎమ్మెల్యే ప్రస్తావన



రెవెన్యూ డివిజన్ సాధన సమితి దీక్షలో కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం ప్రకటించిన నాటి మాజీ ఎమ్మెల్యేలు (ఫైల్)

- రెవెన్యూ డివిజన్ సాధన సమితి హర్షం
- పలువురికి ఉపాధి దొరికే అవకాశం



జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం

జడ్చర్ల టౌన్: జడ్చర్ల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రెండు నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డిని కలసి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై వినతిపత్రాలు సమర్పించిన స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీలోనూ ప్రస్తావించటం గమనార్హం. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చకు వచ్చిన సమయంలో జడ్చర్లను రెవె న్యూ డివిజన్ చేయాలంటూ ఎమ్మెల్యే ప్రస్తావించారు. దానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని బదులిచ్చారు. దీంతో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులతో పాటు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలతోపాటు అన్ని శాఖలకు చెందిన అధికార కార్యాలయాలు ఏర్పాటుకావటంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలువురికి ఉపాధి దొరికే అవకాశముంది.

మూడేళ్ల పాటు పోరాటం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తజిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు సమయంలో జడ్చర్ల రెవెన్యూ డివిజన్ చేయాలంటూ సాధన సమితి ఏర్పాటుచేసి మూడేళ్లపాటు ఉద్యమాలు చేశారు. ఉద్యమానికి అప్పటి మాజీ ఎమ్మెల్యేలతో పాటు, విపక్షపార్టీగా ఉన్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐలు మద్దతు పలికాయి. అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సైతం వారి దీక్షా శిబిరానికి వచ్చి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయిస్తానని హామి ఇచ్చి విరమింపజేశారు. కానీ అది హామీగానే మిగిలిపోయింది.

ఒకే ఒక్క రెవెన్యూ డివిజన్

జిల్లాల విభజన తరువాత మహబూబ్‌నగర్ జిల్లాలో కేవలం ఒకే ఒక్క రెవెన్యూ డివిజన్ అది మహబూబ్‌నగర్‌లోనే ఉండింది. జడ్చర్ల నుంచి 44, 167 నంబర్లు కలిగిన జాతీయరహదారులు వెళ్తున్నాయి. పోలేపల్లిలో ఏర్పాటుచేసిన ఫార్మాసెజ్ ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్ల అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. రెవెన్యూ డివిజన్‌గా మారితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది.

స్వాగతిస్తున్నాం



రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేస్తున్న కృషిని స్వాగతిస్తున్నాం. బీఆర్ఎస్ హయాంలో మూడేళ్లపాటు పోరాటం చేసి సాధించలేకపోయాం. మరో పోరాటం చేద్దామనుకున్నాం. ఎమ్మెల్యే సానుకూలంగా ఉండటంతో వాయిదా వేశాం. డివిజన్ ఏర్పాటులో తమ వంతు సహకారం అందిస్తాం.

–కృష్ణయాదవ్, కోఆర్డినేటర్, రెవెన్యూ డివిజన్ సాధన సమితి

ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి



అసెంబ్లీలో మాట్లాడుతున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అసెంబ్లీలో రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు అంశం రాగా ఎమ్మెల్యే సభదృష్టికి జడ్చర్ల అంశాన్ని తీసుకువచ్చారు. రెవెన్యూ శాఖ మంత్రి పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో ఈ విషయం విస్తృత చర్చకు దారితీసింది.

పంప్‌మోడ్ పద్ధతిలో 8,350 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 8,350 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,695, రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మంగళవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 863.4 అడుగుల వద్ద 116.9200 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,000 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

రామన్‌పాడులో 1,021 అడుగులు..

మదనాపురం: రామన్‌పాడులో మంగళవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021అడుగులకు చేరింది. జూరాల ఎడమకాల్వ 510క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. ఎన్టీఆర్ కాల్వద్వారా 695 క్యూసెక్కులు కుడి, ఎడమకాల్వద్వారా 35క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు ఏఈఈ వరప్రసాద్ తెలిపారు.

రేపు ఎంవీఎస్‌లో నేషనల్ సెమినార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి రీసెర్చ్‌స్కాలర్స్ పరిశోధన పత్రాలను సమర్పిస్తారన్నారు. కీనోట్ స్పీకర్‌గా రచయితలు రఘుపతి, సాంబయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి



జిల్లా బేస్‌బాల్ జట్లతో డీవైఎస్ఓ తదితరులు

- జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్
- హైదరాబాద్ తరలిన బేస్‌బాల్ జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌళి స్టేడియంలో బుధవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా పురుషులు, మహిళా జట్లు మంగళవారం తరలివెళ్లాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లా జట్లను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌గా నిలిచి జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెటాటీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, వడ్డెన్న, కోచ్ సాదిక్‌అలీ, పీడీలు వేణుగోపాల్, పరశురాం, నిరంజన్‌రావు, రాఘవేందర్, నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పీఈటీ శ్వేత పాల్గొన్నారు.

జిల్లా బేస్‌బాల్ పురుషుల జట్టు

ఎస్.లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌నాయక్, కిరణ్‌కుమార్, నజీబుర్ రెహమాన్, ఎ.శ్రీను, మోహన్, శ్రీకాంత్, చరణ్, లోకేష్, రాహుల్, రాంచరణ్, విష్ణు, కె.కిరణ్, ఆకాష్, నరేష్ రాథోడ్, వై.ప్రసాద్

మహిళా జట్టు..

కీర్తి, నిఖిత, పల్లవి, వర్షిత, స్వప్న, శిరీషారాణి, జ్యోత్స్న, శ్రీజ, మౌనిక, సుశ్మితారెడ్డి, ఐశ్వర్య, నవ్యశ్రీ, బి.శ్వేత, కె.చైత్ర, హరిత, అంజలి.

ఎస్సీ వర్గీకరణ విరమించుకోవాలి



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు సీఎం రేవంత్ రెడ్డి విరమించుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. బీజేపీకి ఓటు వేయమని చెప్పిన మందకృష్ణ మాదిగ మాటలకు తలొగ్గి సుప్రీంకోర్టు చేసిన సూచనలను తుంగలో తొక్కి ఏకపక్షంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఇకనైనా ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు మానుకోవాలని, లేనిపక్షంలో లక్ష మందితో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు కేశవులు, కాసుగడ్డ యాదయ్య, కంచిమి గోపాల్, బాలరాజు, రఘునాథ్, హన్మంతు, చెన్నకేశవులు, రమేష్ పాల్గొన్నారు.

ఇంధనాన్ని పొదుపు చేయాలి



ఇంధన పొదుపుపై ఉపన్యాసం చేస్తున్న విద్యార్థులు

మద్దూరు: భావితరాల కోసం ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన అవసరం ఉందని టీజీ రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఇందన పొదుపుపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ఇంధనాన్ని ఏవిధంగా పొదుపు చేయాలో విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు బాలాజీ, సూర్యప్రకాష్, టీజీ రెడ్కో సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వవాహన సేవ

పడమటి ఆంజనేయస్వామి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి 7గంటలకు ఆలయంలో అశ్వవాహన సేవ, చక్రతీర్థస్నానం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయం చుట్టు ప్రదక్షిణ చేస్తూ అశ్వవాహన రథంపై కూర్చోబెట్టి లాగారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేకపూజలు చేసి పలువురు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. చైర్మన్ ప్రణేస్‌కుమార్, ఈఓ శ్యాంసుందర్‌చారి, అరవింద్ పాల్గొన్నారు.

- మక్తల్





మక్తల్‌లో ఆలయంలో చక్రతీర్థం స్నానం, అశ్వవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

మక్తల్, ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్లుగా చేయాలి

- అసెంబ్లీలో లేవనెత్తిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మక్తల్, ఆత్మకూర్ మండలాలను రెవెన్యూ డివిజన్ కేంద్రాలుగా చేయాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తారు. రెండు మండలాలు రెవెన్యూ కేంద్రాలుగా చేయాలని అప్పట్లో ధర్నాలు, రాస్తారోకోలు చేసినా, నేటి వరకు చేయలేదన్నారు. మక్తల్ నియోజకవర్గాన్ని రెండు జిల్లాలకు వేరువేరుగా చేశారన్నారు. నారాయణపేట జిల్లాను ఏర్పాటు చేసే సమయంలో మక్తల్, ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్లుగా చేయాలని కోరినట్లు తెలిపారు. ఎన్నికల్లో సమయంలో డివిజన్ కేంద్రాలు చేస్తామని హామి ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మక్తల్, ఆత్మకూర్ మండలాలను రెవెన్యూ డివిజన్ కేంద్రాలుగా ఏర్పాటు చేయాలన్నారు. నారాయణపేట జిల్లాలో ఉన్న మక్తల్‌ను, వనపర్తి జిల్లాలో ఉన్న ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్లు చేయాలని కోరారు.